జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం
ఆదివారం 1 నవంబర్ 2026 పేజీలు : 8

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
సిఐ శ్రీహరి
మొబైల్ ఫ్లాష్ లైట్ లతో ర్యాలీ విజయవంతం

16

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో
పేర్లు నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నవంబర్ 30న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రచురణ
- ఖమ్మం జిల్లాలో 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి వరకు 73,898 దరఖాస్తుల స్వీకరణ
- సర్ 2026 , పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన - మిగతా2లో

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు
ప్రతి ఒక్కరి బాధ్యత

- రాజ్యసభ సభ్యులు వృద్ధి రాజు రవిచంద్ర
- అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ నమోదు అత్యంత కీలకం
- జిల్లా ఇంచార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్
- పట్టభద్రుల సమస్యలను చట్టసభలో విన్నవించడమే తన లక్ష్యం
- ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి
- పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలి
- మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు
- బోనకల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశం

15

తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి
విద్యార్థులకు గాయాలు

- వెంటనే బోనకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.. ఒక విద్యార్థిని కి తలకు గాయాలు 6 కుట్లు
- మరో విద్యార్థినికి కాలుకు గాయం 5 కుట్లు..
- ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న పాఠశాల సిబ్బంది
- అన్ని గదులలో స్లాబ్ పెచ్చులు ఊడుతున్న వైనం.. ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి .. కోరుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు

10

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 1,006 మంది ఓటర్లు అర్హులు కాదని గుర్తించినట్లు పేర్కొన్నారు.ఫారం-6,ఫారం-7ఫారం-8 లకు సంబంధించి మొత్తం 3,080 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. వరంగల్, నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదును మరింత పెంచేందుకు

ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, గడువు లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు,అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించ నున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పీ.శ్రీజ,ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్,బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య,ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు భరోసా..నేరాల నియంత్రణలో

ప్రజల భాగస్వామ్యమే ధ్యేయం

ప్రజల భద్రతకు భరోసా నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యమే ధ్యేయంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.ఇటీవల కాలంలో టేకులపల్లి లోని కేసీఆర్ టవర్ ప్రాంతంలో కొంతమంది గంజాయి సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సిఏఆర్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్, మొత్తం 286 మంది పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయడంతో పాటు కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 బ్లాక్ లలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు,5 ఆటోలు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేవిదంగా 105 మంది వేలిముద్రలు తీసుకొని పరిశీలించండం జరిగింది. గంజాయి అమ్ముతున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మంది, 50 గ్రాముల పొడి గంజాయి,ముగ్గురు చోరి నిందితులను, ఇద్దరు అనుమానితులు గుర్తించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.ఈ ప్రాతంలో స్థానిక ప్రజలు కోరుకున్నట్లు పోలీస్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తామని,బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ప్రధానంగా యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దు సూచించారు. మీ కుటుంబం కోసం.. మీ పిల్లల భవిష్యత్తు కోసం.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నేటి మీ అప్రమత్తతే.. రేపటి మీ పిల్లల భద్రమైన భవిష్యత్తన్నారు. గంజాయి విక్రయదారుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి గంజాయి

రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరిస్తూ.. యువత భవిష్యత్తును కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు.అదేవిదంగా స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికపై నిరతరం నిఘా ఉంటుందన్నారు. స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వుండాలని సూచించారు.అక్రమ సంపాదనకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అలాగే ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల నుండి అప్రమత్తంగా వుండాలని, మీ బ్యాంక్ ఖాతా వివరాల కోసం వచ్చే కాల్స్, ఈమెయిల్స్ కు స్పందించవద్దని సూచించారు.ముఖ్యంగా అపరిచితుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తునట్లయితె స్థానిక పోలీసులకు కాని డయల్ 112కు సమాచారం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు వారి చిరునామా, ఆధార్ కార్డులు చూసిన తరువాతనే ఇంటిని అద్దెకు ఇవ్వాలని స్థానికులకు వివరించారు. ఇలాంటి అకస్మిక తనీఖీ ద్వారా నేరస్థులను గుర్తించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు దోహదపడుతుందన్నారు.నేరాల నియంత్రణ కోరకు నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు , బ్లూకోల్ట్స్ సిబ్బంది ఆయా ప్రాంతల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడంతో పాటు పాత నేరస్థుల సమాచారాన్ని సేకరించడం చేస్తారని తెలిపారు.స్థానిక ప్రజలకు ఎలాంటి అభద్రత భావం లేకుండా ఇలాంటి ఆకస్మికంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం,ఏసీపీలు రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సిసియస్ ఏసీపీ సర్వర్, సిఐలు సాదిక్ పాషా,చిట్టిబాబు,కరుణాకర్,శివప్రసాద్, నాగరాజు, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, పాల్గొన్నారు.

నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం

అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా విస్తృత ప్రచారం నిర్వహించాలి

ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనను వేగవంతం చేయాలి.. దరఖాస్తుదారుల విద్యార్హత, నివాస స్థితిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి

ఈసారి ఖమ్మం జిల్లాలో 1.5 లక్షలకు పైగా పట్టభద్రుల ఓటర్ల నమోదే లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి నవంబర్ 6 తర్వాత కూడా వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందని అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించారని అధికారులను అభినందించారు. అయితే నవంబర్ 6 చివరి తేదీగా భావించి రాజకీయ పార్టీల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, మరోవైపు అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా వేగవంతం కావాల్సి ఉందని అన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఫారం-18 దరఖాస్తుల స్వీకరణతో పాటు వాటి పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని, అదే తేదీన డిగ్రీ పరీక్షల ఫలితాలు ప్రకటించబడిన వారు కూడా అర్హులేనని తెలిపారు. ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ అందుబాటులో లేని సందర్భాల్లో సంబంధిత విద్యాసంస్థ అధిపతి ధృవీకరించిన సర్టిఫికెట్‌ను కూడా పరిశీలనకు స్వీకరించవచ్చని తెలిపారు. విద్యార్హత ధృవీకరణతో పాటు దరఖాస్తుదారుల సాధారణ నివాస స్థితిని క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమర్థవంతంగా నిర్వహించిన తీరును అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం బీఎల్ఓలందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో నివాస ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు నవంబర్ 6తో ముగిసిపోదని, ఆ తేదీ తర్వాత కూడా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల రూపంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు కూడా ఫారం-18 దరఖాస్తులు సమర్పించవచ్చని, నిబంధనల ప్రకారం వాటిని స్వీకరించడం జరుగుతుందని వివరించారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పట్టభద్రులకు, క్షేత్రస్థాయి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. బీఎల్ఓల ప్రధాన బాధ్యత దరఖాస్తుదారుల నివాస స్థితిని క్షేత్రస్థాయిలో ధృవీకరించడమేనని

తెలిపారు. ఒకే ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ఆన్‌లైన్ దరఖాస్తులు రావడం, ఒకే ఐడీ ద్వారా వందల సంఖ్యలో దరఖాస్తులు సమర్పించడం వంటి సందర్భాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. ఒకే ఐడీ ద్వారా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవాలను ధృవీకరించిన తర్వాతే ఆమోదించాలని సూచించారు. అనుమానాస్పద దరఖాస్తుల విషయంలో క్షేత్రస్థాయి విచారణ చేపడుతూనే, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావచ్చనే సానుకూల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఫారం-18 దరఖాస్తుల పరిశీలన అనంతరం పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా అత్యంత జాగ్రత్తగా ప్రణాళిక రూపొందించి చేపట్టాలని సూచించారు. ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ కేంద్రం ఉండే విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని, అవసరమైన జంబో బ్యాలెట్ బాక్సులను ముందుగానే గుర్తించాలని తెలిపారు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా నేరమని, డబుల్ ఓటు నమోదు చేసుకునే వారిపై శిక్షార్హమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈసారి జిల్లాలో 1.5 లక్షలకు పైగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, వారి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ప్రస్తుత ప్రక్రియలో తప్పని సరిగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదుకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసేందుకు కాల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందనే సమాచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి నివాస స్థితిని ధృవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఫారం-18 దరఖాస్తుల విచారణ బాధ్యతలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), సీనియర్ అసిస్టెంట్ కేడర్ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన ఫారం-18 దరఖాస్తులను ప్రతిరోజూ డౌన్‌లోడ్ చేసుకొని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధికారులు బూత్ స్థాయి అధికారుల సహకారంతో దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, వారు సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసితులుగా ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తుల కేటాయింపు కోసం 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 6, 2026 వరకు అందే దరఖాస్తుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను నవంబర్ 10, 2026లోగా సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 25,2026లోగా పరిష్కరించి, డిసెంబర్ 30,2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ డీ. వేణుగోపాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివస్)

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం, పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏసీపీలు సాంబరాజు నర్సింహారావు, ఏవో కళావతి, ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, మినిస్ట్రీయల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి అధికారి ప్రహల్లాద్ సేవలు ప్రశంసనీయం

ఐఎన్టియుసి నేతలు క్రాంతి కుమార్ , కోటేశ్వరరావు

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి జే.వి.యర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహల్లాద్ విధులు నిర్వహిస్తూ, శనివారం పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ సీతారామరాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ , ఏరియా ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు పాల్గొని పూలమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించి,అభినందన జ్ఞాపికను అందజేశారు.ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహల్లాద్ జే.వి.ఆర్ ఓసీ లో సుమారు మూడు సంవత్సరాలపాటు అధికారులు , ఉద్యోగులతో కలిసి సింగరేణి సంస్థలో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి రవాణా జరుగుతున్న ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి దిశా నిర్దేశంలో జే.వి.యర్ ఓసి , సత్తుపల్లి ఏరియా అగ్రగామిగా ప్రథమ స్థానంలో నిలుపుటకు క్రియాశీలకంగా కృషి చేస్తూ, సంస్థ అభ్యున్నతికి ఉత్పత్తి సాధనలో కీలకపాత్ర పోషించారని తెలియజేశారు. ఏరియా అధికారులు , ఉద్యోగుల మనసుల్లో తనదైన మార్క్ సాధించుకున్నారు అని తెలియజేశారు. వజ్ర సంకల్పం , క్రమశిక్షణ , పట్టుదల ద్వారా కష్టించి పని చేస్తే ఎలాంటి కఠినమైన లక్ష్యాలైన సాధించవచ్చు అని నిరూపించిన అధికారి ప్రహల్లాద్ అని తెలియజేశారు.అదేవిధంగా సింగరేణి సంస్థకు వివిధ

ఏరియాలలో విధులు నిర్వహిస్తూ సుమారు 38 సంవత్సరాలు సేవలు అందిస్తూ ,సింగరేణి సంస్థ అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. వారి పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో , ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి నాయకులు నాగ ప్రకాష్,రత్నాకర్ బాబు, జగదీష్ మరాఠీ,మురళి,పొట్టి కిరణ్,ఐవి రెడ్డి,రాము, దావూద్,చంద్రశేఖర్, రాంబాబు, కాజా,ఆవుల శీను, రామచందర్,చెరకు రాజు, జనగామ శ్రీనివాస్,డి రమేష్, ఇక్బాల్,గాలి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు,దామోదర్, సందీప్ , కొమురయ్య,చాంద్ ఇతర ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జే.వి.యర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహల్లాద్ కి ఘన వీడ్కోలు

సింగరేణి కాంట్రాక్ట్ డ్రైవర్స్ అసోసియేషన్

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి జే.వి.ఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహల్లాద్ పదవి విరమణ పొందుతున్న సందర్భంగా సత్తుపల్లి సింగరేణి కాంట్రాక్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేశారని తెలియజేస్తూ పదవి విరమణ అనంతరం వారి కుటుంబ సభ్యులతో కలిసి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు , కాంట్రాక్ట్ ఉద్యోగులు , ఇతరులు పాల్గొన్నారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా పాఠశాలల్లో న్యాయ అవగాహన శిబిరాలు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి బాలల హక్కుల పరిరక్షణ,బాలలపై లైంగిక నేరాల నివారణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సురక్షిత్ బచ్పన్ అభియాన్'లిలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించింది. 2026 అక్టోబర్ 26 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్ర మంలో భాగంగా ఖమ్మం యూనిట్కు చెందిన న్యాయాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం,2012 (పోక్సో యాక్ట్)పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి శ్రీమతి కె. జ్యోతిర్మయి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. రజిని, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎ. ప్రవీణ్, నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. నాగలక్ష్మి వివిధ పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనస కూడా ఈ కార్యక్రమంలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు,బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపులను గుర్తించడం, వాటి నుంచి రక్షణ పొందేందుకు అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాల గురించి వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.సామాజిక

మాధ్యమాలు, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని కూడా విద్యార్థులకు వివరించారు.పి.దేవి మనస మాట్లాడుతూ, బాలలపై నేరాలను నిరోధించడంలో చట్టాలపై అవగాహన కీలకమని, ప్రతి బాలుడు, బాలిక తమ హక్కులను తెలుసుకుని సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలల రక్షణకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి అవసరమైన న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.సురక్షిత్ బచ్పన్ అభియాన్' ద్వారా పాఠశాల స్థాయిలోనే బాలలకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ, బాలలపై నేరాల నివారణకు అవసరమైన చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.

ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి.

కారేపల్లి, అక్టోబర్ 31, ప్రజా జ్యోతి: సింగరేణి మండల కేంద్రం కారేపల్లి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో శనివారం సింగరేణి ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో గంజాయి ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సింగరేణి ఎక్సైజ్ సీఐ పి .లింగ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాల వినియోగానికి లోనుకాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల కోసమో, ఉపాధ్యాయుల కోసమో కాకుండా, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం కోసం విద్యార్థులు ఇష్టంతో, బాధ్యతతో విద్యనభ్యసించాలని అన్నారు . మంచి విద్య, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.విజయకుమారీ, అధ్యాపక సిబ్బంది, యువజన సంఘం అధ్యక్షులు పాపయ్య, సింగరేణి మండలమెడికల్ ఆఫీసర్ డా. సురేష్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగించే శ్రీరాంసాగర్ కాలువ సర్వేను నిలిపివేయాలి

పచ్చని పంట పొలాలు, పామాయిల్ తోటలను నష్టపరచొద్దు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు

రఘునాథపాలెం: ప్రజా జ్యోతి రైతులకు ప్రయోజనం లేని ప్రతిపాదిత శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ కోసం చేపడుతున్న భూసర్వేను తక్షణమే నిలిపివేయాలని బీజేపీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులతో కలిసి ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వేను అడ్డుకుని నిరసన తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి, మంచుకొండ, కోయచిలక, రేగులచలక తదితర గ్రామాల్లో గత మూడు రోజులుగా వ్యవసాయ భూముల్లో కాలువ నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కాలువ నిర్మాణంతో రైతులకు మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, ఎకరం, అరెకరం భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు కాలువ నిర్మాణంతో తమ భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పచ్చని పంట పొలాలతో పాటు పెద్దఎత్తున పామాయిల్ తోటలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఎంఎస్పీ కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులను నింపేందుకు భారీ ప్రాజెక్టు చేపట్టినా, ఇప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదని విమర్శించారు. గత ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉండగానే మరో కాలువ పేరుతో రైతుల భూముల్లో సర్వేలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు.

పాత ధరల ప్రకారం పరిహారం ఎలా ఇస్తారు?

కాలువ నిర్మాణంలో భూములు, పామాయిల్ తోటలు కోల్పోయే రైతులకు పరిహారం విషయంలోనూ అన్యాయం జరుగుతోందని గుత్తా వెంకటేశ్వరరావు అన్నారు. 2017 నాటి ధరల ప్రకారం ఒక్కో పామాయిల్ చెట్టుకు సుమారు రూ.1,650 పరిహారం ఇస్తామని చెబుతున్నారని, ప్రస్తుతం సాగు ఖర్చులు, పామాయిల్ గెలల ధరలు, పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో పాత ధరల ప్రకారం పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. చెట్ల వయస్సు, దిగుబడి, భూమి విలువ, భవిష్యత్తు ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

మంత్రి తుమ్మల జోక్యం చేసుకోవాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, మండలంలో జరుగుతున్న కాలువ సర్వేను తక్షణమే నిలిపివేయాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భూసేకరణ చర్యలు చేపట్టవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులను స్వాగతిస్తామని, అయితే వారి పంట పొలాలు, పామాయిల్ తోటలకు నష్టం కలిగించే ప్రాజెక్టులను వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. సర్వే నిలిపివేసి రైతులకు న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండ్ల ముత్తయ్యతో పాటు పొద్దుటూరి కోటిరెడ్డి, పొద్దుటూరి వెంకటరెడ్డి, కోటేరు నాగిరెడ్డి, గోపిరెడ్డి, యుగంధర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, భాగం కోటయ్య, ప్రభాకర్, గురవయ్య, మరకాల వెంకటరెడ్డి, సంజీవరెడ్డి, మారం వెంకటరెడ్డి, చంద్రారెడ్డి, గుత్తా వంశీ, ఆరెంపుల వెంకన్న, కృష్ణ, తోటపల్లి బిక్షం, కొలిపాక బిక్షం తదితరులతో పాటు ఆయా గ్రామాల రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారేపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో సామినేని వర్ధంతి.

కారేపల్లి, అక్టోబర్ 31, ప్రజా జ్యోతి: అరాచక శక్తుల చేతుల్లో హత్య గావించబడిన సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, పాతర్లపాడు మాజీ సర్పంచ్ కామ్రేడ్ సామినేని రామారావు మొదటి వర్ధంతిని శనివారం సిపిఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ సామినేని రామారావు రైతు సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నడపడమే కాకుండా రైతు సమస్యల పరిష్కారానికి నిత్యం తపించారని ప్రభుత్వాలను ప్రశ్నించారని కడవరకు నికాసైన కమ్యూనిస్టుగా జీవించారని అలాంటి మచ్చలేని మార్క్సిస్టు నాయకుని అరాచక కాంగ్రెస్ వాదులు హత్య చేయడం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం లో ఇది జరగడం ఈ కేసును పక్కదారి పట్టించే విధంగా అధికారమే అండగా ఖమ్మం సీపీ ని ఉపయోగించుకొని అసలు నిందితులను కాపాడే కుట్ర జరగడం దుర్మార్గమని విమర్శించారు. అరాచక కాంగ్రెస్ వ్యక్తులు చంపిన ప్రజా సమస్యలపై పాతర్లపాడు గ్రామ సర్పంచ్ గా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల్లో నిత్యం నిలిచి ఉండాలని కొనియాడారు. తన సొంత భూమిని గ్రామ ప్రజలకు ఇండ్ల స్థలాలకై ఇచ్చిన త్యాగజీవిగా చనిపోయేంతవరకు ఎవరు కష్టాల్లో ఉన్న ఆదుకున్న మానవతావాదిగా మన్ననలు పొందారు అని తెలిపారు. ఈ క్రమంలోనే దళిత గిరిజనులకు ప్రజా ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నారని చెప్పుకుంటున్న ఆ పేదల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన సామినేని రామారావు గారిని హత్య చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిజాయితీకి చెప్పే మాటలకు సత్య దూరం అని ఇది ప్రజలు గమనించాలని ఎప్పటికైనా పక్షపాతం బుద్ధిని వదిలి అసలైన నిందితులను అరెస్టు చేయాలని, లేనియెడల న్యాయం జరిగే వరకు పోరాడుతామని నాగేశ్వర్ రావు హెచ్చరించారు. ఈ వర్ధంతిలో సామినేని రామారావు చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్ పూల మాల వేసి నారు, ఈ వర్ధంతిలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలు కొండబోయిన ఉమావతి, సీనియర్ నాయకులు ముక్కా సీతారాములు, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, మేకల రమేష్, మంద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మండలంలో బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ పలు కుటుంబాలు పరామర్శ.

కారేపల్లి, అక్టోబర్ 31, ప్రజా జ్యోతి: సింగరేణి మండలంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ శనివారం పలు కుటుంబాలను పరామర్శించారు. భాగ్యనగర్ గ్రామంలో తన అభిమాని భూక్యా మధు కాలు ఫ్రాక్చర్ అయిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కారేపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సీనియర్ నాయకులు దొంకేనా రవి, జూంకి, కిల్లారి వెంకటేశ్వర్లు, పెద్దిని, మాజీ సర్పంచ్‌లు మోహన్, బన్సీలాల్, మూతి కోటేశ్వరరావు, కృష్ణ, శంకర్, లాలు, మణికొండ నాగేశ్వరరావు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, సంపత్, మురళి, వంశీ, కారేపల్లి 10వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

అధికారులతో, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించిన కమాండెంట్ ఎన్. పెద్దబాబు

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని, రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యత దినోత్సవం) వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆయన మాట్లాడుతూ, దేశ తొలి ఉప ప్రధానిగా, ఉక్కు మనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జీవిత చరిత్ర, ఆయన పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం మరియు దేశ సమగ్రత, ఐక్యత కోసం చేసిన విశేష సేవలను కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు బలమైన పునాది వేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమగ్రత, సమైక్యత, జాతీయ ఐక్యత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కమాండెంట్ గారు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ బి. వినయరావు , బెటాలియన్ పరిపాలన అధికారి అశోక్ కుమార్ , ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు

హాజరైన జనరల్ మేనేజర్ వెంకటాచారి

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని, సింగరేణి సంస్థ సత్తుపల్లి ప్రాంత పరిధిలో 'జాతీయ ఐక్యతా దినోత్సవ' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ప్రాంత ప్రధాన అధికారి ఎస్. వెంకటాచారి ఆధ్వర్యంలో అన్ని గనులు, విభాగాలు మరియు కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది, కార్మికులు దేశ సమగ్రతను, అంతర్గత భద్రతను కాపాడతామని ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశ విలీనంలో మరియు అఖండ భారత నిర్మాణంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. దేశ ఐక్యతను, సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు

కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన సమక్షంలో ఉద్యోగులందరూ జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞను స్వీకరించారు. సత్తుపల్లి ప్రాంత పరిధిలోని ప్రతిష్టాత్మక జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ (జేవీఆర్ ఓసీ), కిష్టారం ఓపెన్ కాస్ట్, జేవీఆర్ బొగ్గు రవాణా కేంద్రం సి హెచ్ పి, జేవీఆర్ వైద్యశాల లతో పాటు అన్ని విభాగాలలో ఆయా విభాగాల అధిపతుల ఆధ్వర్యంలో ఈ ప్రతిజ్ఞా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో కార్మికులు, వైద్య సిబ్బంది, రక్షణ సిబ్బంది అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ రక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకల్లో సత్తుపల్లి ప్రాంత వివిధ విభాగాల అధికారులు, గనుల ప్రాజెక్ట్ అధికారులు, నిర్వాహకులు, వైద్యులు, పర్యవేక్షకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉక్కు మహిళ భారతదేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 42 వ వర్ధంతి,

ఉక్కు మనిషి భారతదేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి జరిపిన

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఉక్కు మహిళ భారతదేశ మొదటి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్వర్గీయ ఇందిర గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ల చిత్ర పటాలకు శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు,శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారతదేశ ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం, దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం అర్పించారని, వారి త్యాగం భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని,దేశాన్ని ఐక్యంగా ఆమె చూపిన అచంచలమైన ధైర్యం,పేదరిక నిర్మూలనకు ఆమె తీసుకొన్న విప్లవాత్మక నిర్ణయాలు నేటికి ఆదర్శప్రాయమని శ్లాఘించారు. అదేవిధంగా ఆమె చూపిన ధృడ నిచ్చయం ఎప్పటికీ కాంగ్రెస్ శ్రేణులకు మరియు దేశ ప్రజలకు మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు.మనం అందరం ఆమె చూపిన బాటలో నడుస్తూ ఆమె ఆశయాలను కొనసాగించటమే మనం స్వర్గీయ ఇందిరా గాంధీ ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. అదే విధంగా భారతదేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దివస్ గా నిర్వహిస్తామని,భారతదేశంలోని 560 పైగా సంస్థానాలను భారత్ యూనియన్ లో విలీనం చేయడంలో ఆయన చారిత్రాత్మక పాత్ర పోషించారని అందుకే ఆయనను ఉక్కు మనిషి అంటారని మనందరంఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్,జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్,కొట్టే రాజశేఖర్ ఖాజా మురళి,గజ్జి సూర్యనారాయణ, ఐ యన్ టి యు సి నాయకులు ఫజల్,రమణ, నగర కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధోన్ వాన్ వెంకట్రావు, తలారి నాగభూషణం, తీగల రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఖమ్మం సర్కిల్ బృందాల యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

క్షేత్రస్థాయిలో మరమ్మతు పనుల్లో నిమగ్నమైన విద్యుత్ సిబ్బంది, కాంట్రాక్టర్లు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఆంధ్రప్రదేశ్‌లో అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాలైన వెట్లపాలెం, కొప్పిగుంట, తిమ్మాపురం,ఇనవోలు,నకరం,అమలాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ఖమ్మం సర్కిల్ నుంచి పంపించిన విద్యుత్ సహాయక బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకుని క్షేత్రస్థాయిలో మరమ్మతు పనులను ప్రారంభించాయి. తుఫాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించి, స్థానిక ప్రజలకు వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా అందించేందుకు సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు.కేవలం ఖమ్మం సర్కిల్ నుంచే 50 విద్యుత్ సహాయక బృందాల్లో 468 మంది సిబ్బంది, 36 వాహనాలతో తుఫాను ప్రభావిత ప్రాంతాలకు తరలివెళ్లి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారు.పలువురు విద్యుత్ కాంట్రాక్టర్లు తమ సిబ్బంది, ప్రత్యేక బృందాలు,అవసరమైన యంత్ర పరికరాలతో ఈ సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు.తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, వాటి మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అవసరమైన విద్యుత్ సామగ్రిని వినియోగిస్తూ, విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేస్తున్నారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు,ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్,ఐఏఎస్ మార్గదర్శకత్వంలో,టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పర్యవేక్షణలో ఈ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మాట్లాడుతూ, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించడం విద్యుత్ శాఖ సిబ్బంది బాధ్యత అని, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఖమ్మం సర్కిల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు మరియు వారి బృందాలు అంకితభావంతో పనిచేస్తున్నాయని, ప్రజలకు త్వరితగతిన విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి స్థానిక ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో బాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా భావి జీవితం

ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసులు యం.వి.సత్యనారాయణ,(ఎస్సై) బి. కృష్ణ ప్రసాద్ రావు (ఎస్సై) సిహెచ్. నాగేశ్వరావు (ఏఎస్సై) బి. తిరుపతి రావు (ఏఎస్సై) బి. రాము (హోంగార్డ్)కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ ఏసీపీ నర్సయ్య ,ఆర్ ఐ లు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు బొంక శ్రీను,జాతీయ ఉపాధ్యక్షులు జజ 21 ఇ . వెంకటేశ్వర్లు,సంక్షేమ సంఘం సీనియర్ అడ్వైజర్ డి .రమేష్,అడ్వైజర్ సిహెచ్ .నాగరాజు,గురుమూర్తి గౌస్ పాషా, అసిన్ అహ్మద్, పవన్, నాగరాజు, హోంగార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి ఎమ్మెల్యే రాగమయి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం ఓపి మందులు హాస్పిటల్ కి వచ్చిన వారిని వైద్య సదుపాయాలపై పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్య పై ఎక్కువ సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యం చేయించుకోవాలని, మంచి, మంచి మందులు ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, వార్డు కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు... ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి అక్టోబర్31 (ప్రజా జ్యోతి) తొలి మహిళ,మాజీ భారత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు, శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి,ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానిగా చేశారని, భారతదేశానికి ఎనలేని సేవలు అందించారని, బ్యాంకులు జాతీయకరణ, గరీబీ హటావో, హరిత విప్లవం, యుద్ధ సమయం లో నాయకత్వం, రాజకీయ భరణాలు రద్దు వంటి బృహత్తర కార్యక్రమాలతో,పేదరిక నిర్మూలన, వ్యవసాయ ఉత్పత్తి పెంపు ,రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అందించేందుకు ఎంతగానో ప్రోత్సాహం అందించారని, ఇలాంటి పథకాలు ద్వారానే భారతదేశ ప్రజలు అభివృద్ధిలో ముందున్నారని తెలియజేశారు. ఆమె సేవలు భావితరాల వారు స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, దోమ ఆనంద్ బాబు, చల్లగుండ్ల నరసింహారావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, షరీఫ్ రామారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, సామేలు, చల్లారి వెంకటేశ్వరరావు, దామర రమేష్, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు,విరివిగా పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా పంటల సాగు చేపట్టాలి

ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల్లో నీటి పొదుపు పాటించాలి: జిల్లా ఉద్యాన అధికారి మధుసూన్

రఘునాథపాలెం ప్రజా జ్యోతి మంచుకొండ గ్రామంలో : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ సూచించారు. శనివారం రఘునాథపాలెం మండలం మంచుకొండలోని గోగినేని రవికుమార్ ఆయిల్‌పామ్ తోటలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ డ్రిప్ సేద్యం ద్వారా పంటలను కాపాడుకోవాలని, రబీలో తక్కువ నీటితో సాగయ్యే కూరగాయల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య మాట్లాడుతూ రబీలో వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి పంటలు, పప్పుదినుసులు సాగు చేయాలని, వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల్లో నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు మందనపు సుధాకర్, తాత రఘురామ్, సర్పంచ్ తేజావత్ శంకర్ నాయక్, ఉద్యాన, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు కేరాఫ్‌గా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

అటువంటి హత్యా రాజకీయాలు మా నాయకుడు భట్టి విక్రమార్క నైజాం కాదు ...

ఎర్రుపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాసరెడ్డి

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి తెల్దరుపల్లికి చెందిన తమ్మినేని సొంత గుండాలే పాతర్ల పాడు మాజీ సర్పంచ్ సీపీఎం పార్టీ రైతుసంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామారావు ని అత్యంత దారుణంగా హత్య చేశారనీ ఎర్రజెండాని నమ్ముకున్న నిజాయితీ పరుడైన రామారావు ని...అ పార్టీ అగ్రనేతలే తన అనుచరులైన రౌడీలతో హతమార్చించారనీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి శనివారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆరోపించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శవ రాజకీయాలు,చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి తెలియవని గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సిపిఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సామినేని రామారావుని హత్య చేసిన విషయం అందరికి తెలిసిందే. ఆయనను అత్యంత కిరాతకంగా హతమార్చిన నిందితులను పట్టుకునేందుకు గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అందరూ కలిసి పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు . ఈ హత్య కేసులో త్వరగా దోషులను పెట్టుకోవాలని సిపిఎం నాయకులు గతంలో అనేక కార్యాలయాల ధర్నాలు రాస్తారోకోలు కూడా చేసిన పరిస్థితులు మనందరికీ తెలుసన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పోలీస్ డిపార్ట్మెంట్ డిజిపి హోదాలో కేసును దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిన విషయం మనందరికీ తెలిసిన విషయమే అన్నారు. అప్పటినుండి రామారావు మర్డర్ కేసును పోలీసులు అనేక కోణాలలో దర్యాప్తు చేయటం జరిగిందన్నారు. పోలీస్ యంత్రాంగం తో పాటు బెంగళూరు ఫారెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ సాంకేతిక లాబరేటరీ వారికి సహకారంతో హత్య స్థలంలో సేకరించిన పలు ఆధారాలతో అనేక కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో నిందితులను పట్టుకొని అరెస్టు చేస్తే.. ఈ హత్యలో స్వయంగా పాల్గొన్న నిందితులు సిపిఎం పార్టీ కేంద్ర నాయకుడు అనుచరులేనని విచారణలో తెలగానే దానిని కప్పిపుచ్చుకునేందుకు పాతర్లపాడు గ్రామం వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్కే ఈ హత్య చేయించాడని...అమాయకులైన తెల్దరుపల్లి వారిని ఖమ్మం పోలీస్ కమిషనర్ అరెస్టు చేశారని...కేసును తప్పు దోవ పట్టిస్తున్నారని మాట్లాడటం చూస్తే గుమ్మడి కాయలు దొంగ ఎవ్వరంటే భుజాలు తడుముకున్నట్లు ఉంది ఈ సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుని వ్యవహారం. దోషులు ఎవరనేది పోలీసులు రాత్రనకా పగలనకా అహర్నిశలు కష్టపడి హంతకలును పట్టుకుని రిమాండ్ చేస్తే వారు తెల్దరుపల్లి కి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులనీ వారికి అనేక కేసుల్లో నేరచరిత్ర కలిగి ఉన్న రౌడీలు, గుండాలని వారితోనే సొంత పార్టీ నాయకుడైన రామారావుని హత్య చేయించడం జరిగిందని, దీనిని ఈ మండల, జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ నమ్ముతున్నారని అనేది తేటతెల్లంగా కనిపిస్తుం దన్నారు. ఇటువంటి హత్య రాజకీయాలు లేకుండా పల్లెలన్నీ పచ్చని పంటలతో కళకళలాడాలని ఎలాంటి కష్టలకు కార్పణ్యాలకు తావునివ్వకూడదనే దృఢ సంకల్పంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమం లో ముందుకు నడిపిస్తున్న బట్టి విక్రమార్క మల్లు పై ఇలాంటి నిందలు వేయడం తగదన్నారు. సొంత తమ్ముడినే హతమార్చిన నేరచరిత్ర కలిగిన సిపిఎం కేంద్ర కమిటీ నాయకుడికి రామారావు లాంటి నాయకుడిని హతమార్చడం పెద్ద లెక్కనా కచ్చితంగా రామారావు లాంటి నిజాయితీ, నిస్వార్థ నాయకుడ్ని తన గుండాలతో హతమార్పించి ఆ నిందను పాతర్ల పాడు గ్రామంలో అమాయకులపై వేయడం రామారావు ఆత్మ క్షోభిస్తూదన్నారు.. ఇప్పటికైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. చట్టం ఎవరిని వదిలిపెట్టదని దోషులెంతటివారినైనా కచ్చితంగా శిక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం టౌన్ సర్పంచ్ నంద్రు అశ్విని,పెగళ్ళపాడు సర్పంచ్ అనీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సగుర్తి వెంకటనారాయణ,జిల్లా సీనియర్ కాంగ్రెసు నాయకులు అనుమోలు వెంకట కృష్ణ రావు క్లస్టర్ ఇంచార్జ్ శీలం వెంకట్రామిరెడ్డి, యన్నం పిచ్చి రెడ్డి,వేమిరెడ్డి వెంకట రెడ్డి, గాంధీపథం అధ్యక్షులు నాగబాబు,ఆత్మా ప్రసాద్, మేరీ చెన్నయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జాన్ బాషా ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాణావత్ శీను నంద్రు జనార్దన్, చిన్న వెంకటేశ్వర్లు,రవి, పారా ప్రసాద్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు...

అయ్యప్ప స్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) పట్టణ శివారులో గల శ్రీ హరి హరాత్మక అయ్యప్ప స్వామి దేవాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా, శుక్రవారం తెల్లవారుజామున గణపతి హోమం అనంతరం, అయ్యప్ప స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించడమైనది. గౌరవ అతిథిగా మువ్వా విజయబాబు పాల్గొన్నారు . మధ్యాహ్నం 3500 మంది భక్తులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ కుమార్ చే మహా అన్నప్రసాద వితరణ ప్రారంభించబడింది. సాయంత్రం 7 వేలకు పైగా మాలాధారులు భక్తులచే ఏర్పాటు చేసిన ఏకశిల పదినెట్టాంబడి,మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గౌరవ మంత్రివర్యులను అయ్యప్ప స్వామి శేష వస్త్రంతో సత్కరించారు. మహా పడిపూజ కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన శ్రీ వాసవి కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీ గాదంశెట్టి నాగరాజు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దోసపాటి అమరలింగేశ్వర రావు ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు కోశాధికారి గుండు ఉమామహేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, ట్రస్ట్ సభ్యులు వందనపు సత్యనారాయణ, రావి నాగేశ్వరరావు, వడ్లపట్ల ఫణి కుమార్, పోలిశెట్టి శ్రీ శివకుమార్, దురిసేటి శ్రీనివాస్, ఇమ్మనేని శ్రీనివాస్, బీమిశెట్టి శ్రీనివాస్, గుడిమెట్ల సోమేశ్వర రావు, రేపాకుల శ్రీనివాస్, అర్చకులు శ్రీ వెంకట సురేష్ ఆచార్యులు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరగాంధీ వర్ధంతి

నేలకొండపల్లి, అక్టోబర్ 31 ప్రజా జ్యోతి: మండలం లోని వివిధ గ్రామాలలో మాజీ ప్రధాని ఇందిర గాంధీ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. మండలం లోని రాయగూడెంలో ఇందిర గాంధీ విగ్రహం కు సర్పంచ్ బోయిన వేణు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, బోయిన నరసింహారావు, ఇరగదిండ్ల నాగరాజు, బ్రహ్మయ్య, గణేష్, రాజాబాబు, రాములు, రాంబాబు, కోసూరి వెంకటేశ్వర్లు, పానకాలు తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పలు గ్రామాలలో ఇందిర గాంధీ వర్ధంతి ని నిర్వహించారు. ఆమె చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చిన్నమండవ గ్రామంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు..

చింతకాని అక్టోబర్ 31(ప్రజాజ్యోతి (ప్రతినిధి) చింతకాని మండలం పరిధిలోని చిన్నమండవ గ్రామంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనైనది, ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పర్చ రామచంద్రరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాసిల్దార్ దినపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రజల అవగాహన కలిగి ఉండాలని మీ గ్రామంలో బడిలో గాని దేవాలయంలో గాని ప్రజలందరూ సమానమని ప్రజల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా ఉండాలని కోరారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్ష , కుల వివక్షత ఎదురైనా కులం పేరు ఎవరైనా తిట్టిన పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయవచ్చని అలాగే ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు 112 ఫోన్ చేసి సంప్రదించవచ్చని అన్నారు.. వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు షెడ్యూల్ కులాలు అభివృద్ధి శాఖ ద్వారా అందిస్తున్నటువంటి వివిధ పథకాల గురించి మరియు అవగాహన కల్పించారు.. మండలాధికారులను గ్రామస్తులు శాలువతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తంగిరాల మాధవి,ఆర్ ఐ ఏకవీర, జిపిఓ లాల్ జాన్ పాషా వార్డ్ మెంబర్స్ గుండ్ల బేబీ రాణి, కాశీమాల సరిత గుండ్ల భద్రమ్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు..

సింగరేణి పి.ఓ ప్రహ్లాద సేవలు అభినందనీయం... భీమిరెడ్డి సుబ్బారెడ్డి

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) జేవియర్ ఓ.సి లో పి.ఓ గా బాధ్యతలు చేపట్టి,శనివారం పదవి విరమణ సందర్భంగా సత్తుపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. పదవి విరమణ సందర్భంగా ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణికి మీరు చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. పదవి అనంతరం అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ,సుఖ సంతోషాలతో శేష జీవితం గడపాలని కోరినారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడతనేని అప్పారావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పానేం ఈశ్వర్, పాకాలగూడెం సర్పంచ్ రామగోవిందాపురం సర్పంచ్ లు ఉన్నారు.

బీసీ హాస్టల్‌లో విద్యార్థి మృతి

అజయ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

కుటుంబానికి ఇల్లు, ఉద్యోగం కల్పించాలి:

బీఆర్ఎస్ నాయకుడు పగడాల నాగరాజు

రఘునాథపాలెం ప్రజా జ్యోతి మండలం గణేష్ వరం గ్రామానికి చెందిన 17 ఏళ్ల అజయ్ ఖమ్మంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ డీఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అక్టోబర్ 30న సాయంత్రం 5 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన అజయ్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో హాస్టల్ సిబ్బంది తలుపులు పగలగొట్టి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అయితే అజయ్ మృతి చెందడంతో ఘటనపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మార్చురీ వద్ద బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులు, నాయకులతో చర్చించారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థిని గెలిపించాలి.

నేలకొండపల్లి, అక్టోబర్ 31 ప్రజా జ్యోతి: ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి ని గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు పొగర్తి సుధాకర్ కోరారు. మండలం లోని వివిధ గ్రామాలలో శనివారం ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పై వ్యతిరేకత పెరిగిందన్నారు. అందుకు ఉదాహరణ దేశంలో మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పారని అన్నారు. అమలు చేయలేని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ మోసపూరిత మాటలను" నమ్మవద్దని సూచించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమం ను విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. యువత, నిరుద్యోగులు, మేధావులు ఓటు నమోదు లో పాల్గొనాలని నిరుద్యోగులు, మేధావులు ఓటు నమోదు లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురాణం దివాకర్, సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన గోపి, ఉప్పు శ్రీను, లిక్కి నరేష్, చిట్యాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టాలెంట్ టెస్ట్

వేపకుంట్ల పాఠశాలలో విద్యార్థులకు స్పీచ్ పోటీలు

రఘునాథపాలెం: ప్రజా జ్యోతి మండలంలోని వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో, 9, 10వ తరగతి విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో టాలెంట్ టెస్ట్, స్పీచ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి ఆధ్వర్యంలో, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు నల్లబోతుల రమాదేవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని, వక్తృత్వ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జక్కంపూడి జగదీష్, కార్యదర్శి రామనాథ్, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఖతూం, సోమ్లు, జావిద్, కళావతి, వెంకట నరసమ్మ, సుశీలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు మేరకు ఇల్లు నిర్మించాలి.

మహిళ అభ్యున్నతి వేదికలు సమాఖ్య భవనాలు

నేలకొండపల్లి, అక్టోబర్31 ప్రజా జ్యోతి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు నిబంధనలు మేరకు చేపట్టాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య సూచించారు. మండలం లోని మంగాపురంతండా లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కు, గ్రామ సమాఖ్య భవనం నిర్మాణం కు శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇంటిని మంజూరు చేస్తుందన్నారు. వాటిని నిబంధనలు ప్రకారం నిర్మించి సకాలంలో బిల్లులు పొందాలని సూచించారు. అదే విధంగా గ్రామాలలో నిర్మిస్తున్న గ్రామ సమాఖ్య .... భవనాలు మహిళల అభ్యున్నతి కి ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. అందుకు భవనాలు వేదిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, పీఆర్. ఏఈ ప్రసాద్, గ్రామ పెద్దలు గోత్రియా తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలో స్లాబ్ పేచ్చులు ఊడి విద్యార్థులకు గాయాలు

బోనకల్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి ఇద్దరు విద్యార్థులకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహం నందు శనివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలకు వెళితే... బోనకల్ లో సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహం నందు 9వ తరగతి గదిలో క్లాసులు జరుగుతుండగా అకస్మాత్తుగా స్లాబ్ పెచ్చులు ఊడి ఇద్దరు విద్యార్థినీలకు గాయాలయ్యాయి. మండల పరిధిలోని చిరునోమల గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చాపల మదుగు పూజిత కు తలకు గాయాలయ్యాయి. చింతకాని మండలం నాగిలిగొండ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని అద్దంకి కీర్తనకు కాలుకు గాయాలయ్యాయి. వైద్య నిమిత్తం పాఠశాల సిబ్బంది వీరిద్దరిని బోనకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలైన చాపల

మదుగు పూజితకు 6 కుట్లు పడ్డాయి. కాలుకు గాయమైన అద్దంకి కీర్తనలకు 5 కుట్లు పడ్డాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంపై పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకు న్నారు. విద్యార్థులు చదువుకుంటున్న గదిలో స్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో పాఠశాల భవనం భద్రతపై పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలో ఉన్నారు. అన్ని తరగతి గదులలో స్లాబ్ పెచ్చులు ఊడి కనిపిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఇన్చార్జి ప్రిన్సిపాల్ షీలా బేగం వివరణ...

పాఠశాలలో అన్ని గదులలో అలాగే పెచ్చులు ఊడిపోతున్నాయని,పాఠశాల సిబ్బంది ఎప్పటికప్పుడు గమనించి ఊడుతున్న స్లాబ్ పెచ్చులను తీసివేసి ప్యాచ్ వర్క్ లు కూడా చేపిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మేము జాగ్రత్తలు పడుతున్నామని అన్నారు. శనివారం విద్యార్థులు క్లాస్ రూమ్ లో క్లాసులు వింటున్న సమయంలో అనుకోకుండా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. పాఠశాల విమానం పనుల విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తామని అన్నారు.

నాసిరకమైన పనులవల్లే ఈ ప్రమాదం : విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాల భవన నిర్మాణం నాసిరకంగా నాణ్యత ప్రమాణాలు లేకుండా నిర్మించడంతో అన్ని గదులలో స్లాబ్ పేచ్చులు ఊడిన పరిస్థితిని చూసి భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరక నిర్మాణాలు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చింతగుర్తిలో పౌర హక్కులపై అవగాహన సదస్సు కార్యక్రమం

రఘునాథపాలెం: ప్రజా జ్యోతి మండలంలోని చింతగుర్తి గ్రామపంచాయతీలో పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ తమ్మినేని ప్రియాంక అధ్యక్షతన, కార్యదర్శి రాంబాబు పర్యవేక్షణలో తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మార్వో ఎస్. శ్వేత మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ షాహినా, ఆర్ఐ ప్రవీణ్, జీపీఓలు రాము, రామాచందు,

మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, నాయకులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంబాబు.

కారేపల్లి ,అక్టోబర్31, ప్రజా జ్యోతి: అర్హత కలిగిన పట్టభద్రులందరు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు .శనివారం సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో సర్పంచ్ బానోత్ హీరాలాల్తో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుకు గడువు తక్కువగా ఉన్నందున అర్హులైన పట్టభద్రులు ఆలస్యం చేయకుండా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటు హక్కు పొందేందుకు అవసరమైన ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతు తెలిపి,మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని పట్టభద్రులందరు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గుగులోత్

భీముడు నాయక్,మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ,ఐఎన్టీయూసీ నాయకుడు లావు ద్యాఈర్య,బీఎల్ఏ గుగులోత్ ప్రసాద్,నాయకులు వాంకుడోత్ రాంబాబు,కోఆర్డినేటర్ దారావత్ యేసు,దాస్య,బన్సీ,సామ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎం జె పి కళాశాల విద్యార్థులు ఎంపిక

అభినందించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సి ఓ సిహెచ్ రాంబాబు

రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచాలి

ఎం జె పి కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా

బోనకల్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీల్లో బోనకల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న ఎం. సంతోష్, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఎన్. సుదీప్ తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు నవంబర్ 1వ తేదీన హైదరాబాద్లో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా తరఫున పాల్గొననున్నారు.

వీరిరువురిని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్సీఓ సి.హెచ్. రాంబాబు, డీసీఓ, కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా, వ్యాయామ ఉపాధ్యాయులు పి. వెంకట్రావు, పి. వెంకటేశ్వర్లు, కళాశాల సిబ్బంది అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై నాన్చుడు ధోరణి తగదు

అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రత్యేక జీవో ద్వారా స్థలాలు కేటాయించాలి

జేఎన్‌జే సొసైటీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయం – ప్రభుత్వ తీరు పై టీడబ్ల్యూజేఎఫ్ ఆగ్రహం

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యపు వైఖరిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా తప్పుబట్టింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా,జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నిజాంపేటలో కేటాయించిన 32 ఎకరాల భూమిని పోలీసులు, రెవెన్యూ అధికారుల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సీల్ వేయించడం ఏమిటని వారు ప్రశ్నించారు.గత 18 ఏళ్ల క్రితం ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇళ్ల స్థలాల కోసం ఇంతకాలం ఎదురుచూస్తున్న జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాంపేటలో సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/2 లో 38 ఎకరాల భూమి కేటాయించారని, ఈ భూమిని ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లడమేనని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలుమార్లు హామీలిచ్చారని గుర్తుచేశారు.సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం పలు సందర్భాల్లో జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందిస్తామని ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులు నేటికీ సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని,ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరించకూడదని వారు హితవు పలికారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలకు, హామీలకే పరిమితం కాకుండా ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) జారీ చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలో జేఎన్‌జే సొసైటీకి కేటాయించిన భూమి విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకొని సభ్యులకు న్యాయం చేయాలని వారు కోరారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సమీకరించి చైతన్య యాత్రలు నిర్వహించడంతో పాటు ఇళ్ల స్థలాల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు హెచ్చరించారు.

గాయపడిన విద్యార్థుల కు పరామర్శ

పరామర్శించిన బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ

బోనకల్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహం నందు శనివారం 9వ తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి గాయపడిన విద్యార్థినిలు చాపలమడుగు పూజిత, అద్దంకి కీర్తన లను బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ పరామర్శించారు. జరిగిన ఘటనపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలో స్లాబ్ పెచ్చులు ఊడుతున్న పరిస్థితిని పరిశీలించారు. పాఠశాల మరమ్మత్తుల కొరకు ఫండ్స్ వచ్చాయని కానీ కాంట్రాక్టర్ మేము ఎంత చెప్పినా పట్టించుకోవడంలేదని పాఠశాల సిబ్బంది ఉపసర్పంచ్ బానోతు కొండకు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ కి కూడా సమాచారం అందించామని పాఠశాల సిబ్బంది అన్నారు. బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ… పాఠశాలల విద్యార్థులకు వెంటనే తరగతి గదుల నుంచి తరలించి వేరే తరగతి గదులలో క్లాసులు నడిపించి స్లాబ్ పెచ్చులు కూడిన మరమ్మత్తు పనులను పూర్తి చేసిన తర్వాతనే మరలా విద్యార్థులను తరగతి గదులకు పంపించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉన్నదని, ఈ ప్రమాదం ఇంతటితో పోలేదని ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి స్పష్టంగా కనబడుతుందని అన్నారు. త్వరితగతిన ఈ మరమత్తు పనులను పూర్తి చేసి విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వెంటనే ఈ విషయంపై శ్రద్ధ వహించి జిల్లా పై అధికారులకు తెలియజేయాలన్నారు. నేను కూడా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ

బోనకల్, అక్టోబర్ 31(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భారత ఉక్కు మనిషి, భారత తొలి ఉప ప్రధానమంత్రి, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లింగంలేని నళిని శ్రీ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో భారతదేశంలో ఉన్న సుమారు 565 సంస్థానాలను భారత యూనియన్లో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన కృషి వల్ల భారతదేశం ఒక సమైక్య దేశంగా రూపుదిద్దుకోవడానికి మార్గం సుగమమైందని వివరించారు. అదేవిధంగా భారత రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో కూడా పటేల్ విశేష కృషి చేశారని, రాజ్యాంగ పరిషత్లో ప్రాథమిక హక్కులు, మైనారిటీల హక్కులు, గిరిజన ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన సలహా సంఘానికి అధ్యక్షత వహించారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం పరిరక్షణకు తన వంతు కృషి చేశారని పేర్కొన్నారు.

యస్.బి.ఐ.టి. లో ఆధునిక ముద్రణ యంత్ర ఆవిష్కరణ

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి విద్యార్థుల సౌకర్యార్థం కళాశాల ఆవరణలో ఆధునిక ముద్రణా యంత్రాన్ని ఆవిష్కరించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో యంత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల తమ రోజువారీ విద్యాభ్యాసంలో బాగంగా నోట్‌బుక్స్, టెక్స్‌బుక్స్,హాల్‌టికెట్స్ తదితర విషయాలలో ముద్రణా ప్రాముఖ్యతను గమనించి కళాశాల ఆవరణలోనే ఆధునిక యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవలసిందిగా సూచించారు. క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా నిర్వహించబడే ఎర్రి ప్రింట్స అనే యంత్రాన్ని కళాశాల ఆవరణలో అందుబాటులోకి తెచ్చినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి.ధాత్రి తెలిపారు. ప్రింట్ కావలసిన విద్యార్థులు క్యు.ఆర్. కోడ్ ను స్కాన్ చేసి డాక్యుమెంట్‌ను అప్‌లోడ్ చేయగా వివిధ సెట్టింగ్స్‌కు అనుగుణంగా ప్రింట్‌ను అందిస్తుందని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. కళాశాల విద్యార్థుల నిత్యఅవసరాలలో బాగంగా వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా జి.రాజ్‌కుమార్

తెలిపారు.ప్రింట్‌లకు విద్యార్థులు ఇతర వ్యక్తులపై ఆధారపడకుండా కళాశాల ఆవరణలోనే ముద్రణా యంత్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కేవలం విద్యకు సంబంధించినవే కాకుండా వ్యక్తిగత విషయాల గోప్యతలో ఆధార్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాన్‌కార్డ్ వంటివి ఇతరుల చేతిలోకి వెళ్ళకుండా ఈ యంత్రం ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం....!

వాహనం ట్యూబ్ పగిలి..వీల్ విరిగి.. బోల్తా పడ్డ వాహనం...

ఆరుగురు కు ప్రమాదం.

ముగ్గురు కు తీవ్ర గాయాలు...ఖమ్మం తరలింపు.

నేలకొండపల్లి, అక్టోబర్ 31 ప్రజా జ్యోతి : కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పెను ప్రమాదం తప్పింది...వాహనం బోల్తాపడిన ఘటన లో ముగ్గురు కు తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం గ్రామానికి చెందిన సెంట్రింగ్ పని చేసే కూలీలు శనివారం ఖమ్మం నుంచి కోదాడ అశోక్ లీలాండ్ వాహనంలో కోదాడ పని నిమ్మిత్తం వెళ్తున్నారు. కోదాడ లో నిర్మాణంలో ఉన్న కోర్టు వద్ద కు ఐరన్ సెంట్రింగ్ తీసుకెళ్తున్నారు. మండల కేంద్రంలోని నేలకొండపల్లి వద్ద కు రాగానే జాతీయ రహదారి పై వాహనం ట్యూబ్ పగిలి వీల్ విరిగింది. దీని వలన వాహనంలో ఉన్న ఐరన్ సెంట్రింగ్ ఒక పక్క కు ఒరిగాయి. దీంతో వాహనం బోల్తా పడింది. అందులో వాహనం పై సెంట్రింగ్ పై ఉన్న బయ్యారం కు చెందిన సురేష్, (38), రాంసింగ్ (40) సురేష్, హనుమంత్ (45), నరేష్ (35) లకు తీవ్ర గాయాలైయ్యాయి. క్యాబిన్ లో ఉన్న మరో ఇద్దరు కు స్వల్ప గాయాలైయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో వెనక నుంచి పలు వాహనాలు దగ్గర గా దూసుకొచ్చాయి. అప్రమతం కావటంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్ ద్వారా నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం మగ్గురు ను మెరుగైన

వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఘటనా స్థలం కు పోలీసులు చేరుకుని, వివరాలు సేకరించారు. అదే విధంగా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వద్దకు వెళ్లి ప్రమాద ఘటన వివరాలు సేకరించారు.

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలి

జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ ఆదేశాల ప్రకారం,జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, విక్రయ కేంద్రాలు బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలోకు గరిష్ట చిల్లర ధరలు బిపిటి,కెఎన్ఎంకిలో రూ. 66,ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా కిలో రూ. 74, హెచ్ఎంటీ జెఎస్ఆర్ కిలో రూ. 79గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరల వివరాలతో కూడిన ప్రభుత్వ బ్యానర్ ను రైస్ మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు, విక్రయ కేంద్రాల వద్ద వినియోగదారులకు కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ (పౌర సరఫరాలు) ఆదేశాల మేరకు,జిల్లా పౌర సరఫరాల అధికారి పట్టణంలోని బియ్యం విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యాన్ని విక్రయించాలని, ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విక్రయదారులను హెచ్చరించారు. ధరల పట్టిక ప్రదర్శనలో లేదా నిర్ణయించిన ధరల అమలులో ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వినియోగదారులు ఎవరైనా నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే, ఆ విషయాన్ని వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం, ఖమ్మం దృష్టికి తీసుకురావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖమ్మం నగరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్‌కు వినతి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి భారత ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాజేష్ గుప్తా మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ తొలి ఉప ప్రధానమంత్రి మరియు హోంమంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆ మహనీయుని సేవలకు గుర్తింపుగా ఖమ్మం నగరంలోని అనువైన ప్రధాన కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించి, ప్రభుత్వ అనుమతులు మంజూరు చేసేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్ర యువతకు, భావి భారత పౌరులకు స్ఫూర్తినివ్వాలని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విగ్రహ ఏర్పాటు దోహదపడుతుందని రాజేష్ గుప్తా ఆశాభావం వ్యక్తం చేశారు.

కెసిఆర్ టవర్ ఆకస్మికంగా పోలీసులు తనిఖీలు 14 మంది అరెస్ట్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఇటీవల కాలంలో టేకులపల్లి లోని కేసీఆర్ టవర్ ప్రాంతంలో కొంతమంది గంజాయి సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సిఏఆర్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్, మొత్తం 286 మంది పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయడంతో పాటు కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 బ్లాక్ లలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు,5 ఆటోలు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేవిదంగా 105 మంది వేలిముద్రలు తీసుకొని పరిశీలించడం జరిగింది. గంజాయి అమ్ముతున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మంది,50 గ్రాముల పొడి గంజాయి,ముగ్గురు చోరీ నిందితులను,ఇద్దరు అనుమానితులు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ప్రాంతంలో స్థానిక ప్రజలు కోరుకున్నట్లు పోలీస్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తామని, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దు సూచించారు. మీ కుటుంబం కోసం.. మీ పిల్లల భవిష్యత్తు కోసం.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నేటి మీ అప్రమత్తతే.. రేపటి మీ పిల్లల భద్రమైన భవిష్యత్తన్నారు. గంజాయి విక్రయదారుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి గంజాయి రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరిస్తూ యువత భవిష్యత్తును కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు. అదేవిదంగా స్వీయ

రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికపై నిరతరం నిఘా ఉంటుందన్నారు. స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వుండాలని సూచించారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అలాగే ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల నుండి అప్రమత్తంగా వుండాలని, మీ బ్యాంక్ ఖాతా వివరాల కోసం వచ్చే కాల్స్, ఈమెయిల్స్ కు స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా అపరిచితుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే స్థానిక పోలీసులకు కాని డయల్ 112కు సమాచారం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు చిరునామా, ఆధార్ కార్డులు చూసిన తరువాతనే ఇంటిని అద్దెకు ఇవ్వాలని స్థానికులకు వివరించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీ ద్వారా నేరస్థులను గుర్తించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు దోహదపడుతుందన్నారు.

కామేపల్లి మండల కేంద్రంలో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి,

ప్రజలకు ఆమె సేవలు చిరస్మరణీయం

కామేపల్లి ప్రజా జ్యోతి అక్టోబర్ 31 భారత దేశ తొలి మహిళ ప్రధాని దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు అన్నారు. కామేపల్లి లో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు అనంతరం ఏర్పాటు చేసినా కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ దేశ ఐక్యత ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఇందిరాగాంధీ అనుసరించిన

చూపిన నాయకత్వం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భారత స్వతంత్ర పోరాటంలో తన తండ్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ తో కలిసి ఇందిరాగాంధీ ఎంతో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాల పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో చరిత్ర ఆత్మగా సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసి దిశగా బ్యాంకులో జాతీయ కరణ రాజాభరణాల రద్దు రూపాయి మూల్యాంకనం ఉంటే అనేక సాహసోపేతమైన సూచనలను నిర్ణయాలు తీసుకున్న ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని ముందుకు నడిపేయని ఆమె అందించిన సంస్కరణలు అందరికీ ఎల్లప్పుడూ ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కె పతే అహ్మద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గబురు నాయక్, కామేపల్లి మాజీ ఎంపీటీసీ దొడ్డిదర్ల సుందరం, కామేపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య సీతారాములు, కామేపల్లి పార్టీ అధ్యక్షుడు మాజీ సర్పంచులు అజ్మీర రాందాస్ నాయక్ అజ్మీర అర్జున్ నాయక్ చిన్ని ఉపసర్పంచ్ రాయరా లక్ష్మణరావు సేలం గుడివాడ శ్రీనివాస్ తిరుపతయ్య రంగయ్య సుమన్ నాయక్ కామేపల్లి వార్డు సభ్యులు శ్రీసుతో పాటు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు గ్రామంలో పాడి పశువులకు గర్భాధారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,

బిడెమో ద్వారా వివరించిన పశు వైద్యాధికారి డాక్టర్ జి .నాగులు

ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు

బిపాడి పశువుల సంరక్షణలో జాగ్రత్తలు వహిస్తేనే అధిక దిగుబడులు,

కామేపల్లి ప్రజా జ్యోతి అక్టోబర్ 31 పాడి పశువుల పోషణలు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా పాడి పశువుల రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చునని మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి నాగులు పిలుపునిచ్చారు. శనివారం కామేపల్లి మండలం ఊపూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆత్మ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో పాడి పశువుల రైతులకు కృత్రిమ గర్భధారణ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రత్యేకంగా కృత్రిమ గర్భధారణ విధానము దానికి ఉపయోగించే పరికరాలు తీసుకోవలసిన జాగ్రత్తలను సమగ్రంగా వివరించారు. పశువులు ఈతకు వచ్చిన సమయంలో పాటించాల్సిన పోషకాహార నియమాలు దర్భాధారణ సమయం నాటి నుంచి ఈ నే వరకు రైతు పాటించాల్సిన శ్రద్ధ గురించి ఆయన పలు కీలక సూచనలు చేశారు సరైన జాతికి చెందిన వీర్ అనాలికలను ఉపయోగించడం ద్వారా నాణ్యమైన పాలు ఇచ్చే పశు సంతతిని వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ తమలపాటి సత్యనారాయణ, పస్సుసమర్ధత శాఖ ఏ హెచ్ ఓ బి జగదీష్, శిరీషలతోపాటు ఊట్కూరు గ్రామ ప్రజాప్రతినిధులు బాడీ రైతులు మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు

బోనకల్ తహసిల్దార్ చల్లూరి సుధాకర్ బదిలీ

నూతన తహసిల్దారుగా వి వెంకటేశ్వర్లు నియామకం

బోనకల్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): బోనకల్ తాహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న చల్లూరి సుధాకర్ సాధారణ బదిలీలో భాగంగా శుక్రవారం సింగరేణికి బదిలీ అయ్యారు. సింగరేణిలో తాహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న వి వెంకటేశ్వర్లు బదిలీపై బోనకల్ తహసిల్దారు గా నియమితులయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వులను శుక్రవారం వారికి అందజేశారు. బోనకల్ కు నూతన తాహసిల్దారుగా రానున్న వి వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం..

పౌర హక్కులపై సమాజంలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

తాహశీల్దార్ శ్రీనివాసరావు,

ఎంపీడీవో దిస్ సోంలాల్ ,

ఘనంగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సదస్సు,

కామేపల్లి ప్రజా జ్యోతి అక్టోబర్ 31 కామేపల్లి మండల కేంద్రంలోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సదస్సు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై సమాజంలోని ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంచుకోవాలని హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించవద్దని కామేపల్లి తహసిల్దార్ శ్రీనివాసరావు, మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సోమలాల్ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ యందు స్థానిక సర్పంచ్ అజ్మీర బుల్లి హరినాయక్ అధ్యక్షతన జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల అవగాహన సదస్సు

నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు మాట్లాడుతూ సమాజంలో వెనకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా లభించే చట్టపరమైన హక్కులు పరిరక్షణ చట్టాల గురించి వివరంగా వివరించారు. ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారునికి చేరినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ముచ్చర్ల వసతి గృహ సంక్షేమ అధికారి చింతకాయల కృష్ణ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిపై విస్తృత ప్రచారం కల్పించి అర్హులందరికీ వర్తింపచేయాలని అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు ఎస్సీ చట్టాలు రక్షణ నిబంధనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు గ్రామపంచాయతీ అధికారులు వివిధ శాఖల ప్రతినిధులు దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

రాజ్యసభ సభ్యులు వృద్ధి రాజు రవిచంద్ర

విద్యార్థులకు ప్రాణహాని జరిగే సూచనలు కనిపిస్తున్నాయి

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

సమీకృత బాలికల వసతి గృహాన్ని సందర్శించిన బిఆర్ఎస్ ప్రముఖులు

బోనకల్, అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి): బోనకల్ మండల కేంద్రంలో ఉన్న సమీకృత బాలికల వసతి గృహాన్ని బిఆర్ఎస్ బృందం శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి విద్యార్థులకు గాయాలైన సంఘటన పై ప్రిన్సిపాల్ పద్మావతి నీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వృద్ధి రాజు రవిచంద్ర మాట్లాడుతూ... వెంటనే విద్యార్థులను వేరే గదులకు పంపించి మరమత్తు పనులు పూర్తి చేసిన తర్వాతనే మరల ఈ తరగతి గదులకు తీసుకురావాలని అన్నారు. ఈ విషయంపై మేము కలెక్టర్ తో మాట్లాడతామని అన్నారు. నాసిరకంగా భవన నిర్మాణం చేపట్టిన సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకునే విధంగా మేము కలెక్టర్కు విన్నవిస్తామని అన్నారు. మరల ఈ ఘటన జరగకుండా జాగ్రత్తలు పాటించాలని

ప్రిన్సిపాల్ కు సూచించారు. మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఈ విధంగా తరగతి గదులలో స్లాబ్ పెచ్చులు ఊడుతుంటే ఇన్ని రోజులు పాఠశాల సిబ్బంది అధికారులకు ఎందుకు తెలియజేయలేదని అన్నారు. ఈ పెచ్చులు ఊడటం వలన విద్యార్థులకు ప్రాణహాని జరిగే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయని తెలియజేశారు. కాబట్టి పాఠశాల భవన నిర్మాణ భద్రతపై జిల్లా పై అధికారుల దృష్టికి పాఠశాల సిబ్బంది కూడా

తీసుకువెళ్లాలని అన్నారు. సందర్శించిన వారిలో జిల్లా ఇంచార్జ్ తక్కెలపాటి రవీందర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, బోనకల్ మండల మాజీ జడ్పిటిసి బానోతు కొండ, బిఆర్ఎస్ నాయకులు పారా ప్రసాద్, బంధం నాగేశ్వరరావు, గద్దల వెంకటేశ్వర్లు, కాకాని శ్రీనివాసరావు, కాటేపల్లి శేఖర్, తదితర బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ 42 వ వర్ధంతి వేడుకలు

నివాళులర్పించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

పాలేరు ఆర్.సి అక్టోబర్ 31 ప్రజా జ్యోతి కుసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉక్కు మహిళ భారతదేశ మొదటి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరీ వెంకట్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి స్వర్గీయ ఇందిర గాంధీ చిత్ర పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరా గాంధీ భారతదేశ ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం మరియు దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం అర్పించారని, వారి త్యాగం భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని,దేశాన్ని ఐక్యంగా ఆమె చూపిన అచంచలమైన ధైర్యం,పేదరిక నిర్మూలనకు

ఆమె తీసుకొన్న విప్లవాత్మక నిర్ణయాలు నేటికి ఆదర్శప్రాయమని శ్లాఘించారు అదేవిధంగా ఆమె చూపిన ధృడ నిచ్చయం ఎప్పటికీ కాంగ్రెస్ శ్రేణులకు మరియు దేశ ప్రజలకు మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు. మనం అందరం ఆమె చూపిన బాటలో నడుస్తూ ఆమె ఆశయాలను కొనసాగించటమే మనం స్వర్గీయ ఇందిరా గాంధీ ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హాపీజుద్ద్ న్, స్థానిక మాజీ ఎంపీటీసీ మాదాసు .ఉపేందర్, కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి మైపాల్, ఉపసర్పంచ్ చెన్ను వెంకటరమణ, నాయకులు బెల్లంకొండ శరత్, బెల్లంకొండ కిరణ్, పెంద్ర అంజయ్య, చంద్రశేఖర్, చాట్ల పరశురామ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చాపల పెంపకంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలు

ముఖ్య అతిథిగా డాక్టర్ రవీందర్ కుమార్ రెడ్డి

పాలేరు ఆర్.సీ అక్టోబర్31 ప్రజా జ్యోతి మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ మత్స్య రైతులకు మత్స్య కారులకు జరుగుతున్న దేశవాళీ తెల్ల చేపల పెంపకం" అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం 3వ రోజు శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవీంద్ర కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఫార్మర్ డీన్ కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్, ముత్తుకూరు, ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం మాట్లాడుతూమత్స్య రైతులు తప్పకుండా మత్స్య పరిశోధన స్థానం పాలేరు, మత్స్య శాస్త్రవేత్తలు "దేశవాళి కార్పు చేప పిల్లల పెంపకం మరియు యాజమాన్యం" పై నేర్పిన మెలకువలను తప్పకుండా పాటించాలని కోరారు.అలాగే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాలపథకాలనుకూడా సద్వినియోగంచేసుకో వాలని తెలిపారు.అదేవిధంగా మత్స్య రైతులు తరచుగా చేసే తమ తపొప్పులను సరిదిద్దుకుంటూ తమ జీవితాలలో ఈ మత్స్య రంగము సహాయముతో మరింత ముందుకు సాగాలని కోరారు.అదేవిధంగా మత్స్య రైతులకు నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫామ్ గురించి కూడా సంక్షిప్తంగా వివరించారు.డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని మన తెలంగాణ మత్స్య రైతులు మరి మత్స్యకారులు ఆచరణలో పెట్టి మంచి లాభాలని పొందాలని కోరారు. పి. శాంతన్న మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ పథకాల గురించి మత్స్య రైతులకు మరియు మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు. సిగ నాగరాజు, ఫిషరీస్ యంగ్ ప్రొఫెషనల్ మాట్లాడుతూ చేపల పెంపకంలో సాధారణంగా సోకే వివిధ రకాల వ్యాధులను గురించి మత్స్య రైతులకు మరియు మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు.చివరిగా ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల మత్స్యకారులు ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, కొమరం భీం ఆసిఫాబాద్, సుమారు మత్స్యకారులు 25 మంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత

బోనకల్, అక్టోబర్ 31(ప్రజా జ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు పనిచేయాలని రాజ్యసభ సభ్యులు వృద్ధి రాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, జిల్లా ఇంచార్జ్ తక్కెలపాటి రవీందర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తు పట్టభద్రులందరికీ ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఇంచార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ.... ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని సూచించారు.

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని తన హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని అన్నారు.

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు అవగాహన ఉందని, వారి సమస్యలను చట్టసభలో వినిపించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు వినియోగించుకోవాలని అన్నారు.

మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ... బోనకల్ మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై చైతన్యం తీసుకురావాలని సూచించారు.

ఈ సమావేశంలో మండల మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వేమూరి ప్రసాద్, మంకెన రమేష్, పారా ప్రసాద్, కాకాని శ్రీనివాసరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఇటికల శ్రీనివాసరావు, గురిజాల హనుమంతరావు, బంక మల్లయ్య, సామినేని హరిప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరరావు, జంగా రవి, పిన్నెల్లి శ్రీనివాసరావు, బొడ్డ వెంకట రామారావు, పోట్ల ప్రసాద్, గద్దం వెంకట్, ధర్మారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో వరుస చోరీలతో ఆందోళన

దుకాణంలో రూ.30 వేల నగదు అపహరణ. పోలీసుల దర్యాప్తు

పాలేరు ఆర్.సీ అక్టోబర్ 31 ప్రజా జ్యోతి కూసుమంచి మండల కేంద్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓ దుకాణంలో యజమాని అందుబాటులో లేని సమయంలో కౌంటర్లో ఉన్న రూ.30 వేల నగదు అపహరణకు గురైన సంఘటన చోటుచేసుకుంది .వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన కూరపాటి నరేందర్‌కు సంబంధించిన దుకాణంలో శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. నరేందర్ పూజా కార్యక్రమాల నిమిత్తం దుకాణం నుంచి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కౌంటర్లో ఉన్న నగదును అపహరించినట్లు బాధితుడు తెలిపారు.కొద్దిసేపటి తర్వాత దుకాణానికి వచ్చిన నరేందర్ సతీమణి కౌంటర్ తెరిచి ఉండటాన్ని గమనించి ఆయనకు సమాచారం అందించారు. దీంతో దుకాణానికి చేరుకుని పరిశీలించగా నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. కాగా, రెండు వారాల క్రితం మండలంలోని పాత మసీదు సెంటర్లో అర్వపల్లి లక్ష్మమ్మ ఇంటి తాళం పగలగొట్టి గ్యాస్ సిలిండర్ అపహరణకు గురైన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన మరువకముందే మరో చోరీ జరగడంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చోరీ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. మండల కేంద్రంలో పోలీసు గస్తీని మరింత పెంచాలని, అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టభద్రుల చెంతకే వెళ్లి ఎమ్మెల్సీ ఓటరు నమోదు

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేసినమాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ రావు

పాలేరు ఆర్.సీ అక్టోబర్ 31 ప్రజాజ్యోతి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని పార్టీ నాయకులు కోరుతున్నారు. ఇందులో భాగంగా మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ రావు శనివారం డిగ్రీ పట్టభద్రుల నివాసాలకు స్వయంగా వెళ్లి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఓటు ప్రాధాన్యతను వివరించారు. అర్హులైన వారి వివరాలను సేకరించి నమోదు ప్రక్రియకు సహకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిలిచి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్లి నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

చింతకాని అక్టోబర్ 31ప్రజాజ్యోతి (ప్రతినిధి) అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) పిలుపు మేరకు రేపు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు చింతకాని మండలం నుంచి మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు,జిల్లా మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కర్ రావు, గాంధీనగర్ ఉపసర్పంచ్ వంగూరు రమేష్,జిల్లా కాంగ్రెస్ నాయకులు వనం బాబు, చింతకాని మండల కాంగ్రెస్ కార్యదర్శి కూరపాటి రాము తదితరాలు ఢిల్లీకి ప్రయాణమయ్యారు .

స్వచ్ఛత,పచ్చదనంలో బాలికల పాఠశాలకు ఉత్తమ అవార్డు

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో కడ్తాల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సత్తుపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అయ్యగారిపేట పాఠశాలకు జిల్లా స్థాయి ఉత్తమ పాఠశాల అవార్డు లభించింది. పాఠశాలలో పరిశుభ్రత, స్వచ్ఛమైన పరిసరాల నిర్వహణ, పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణ, పర్యావరణ హిత వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో పాఠశాల కనబరిచిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరుడు నాగేశ్వరరావు , ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రీదేవి అవార్డును అందుకున్నారు. అవార్డులో భాగంగా మెమెంటో, ప్రశంసాపత్రంతో పాటు రూ.20వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి ప్రేమ, మొక్కల పెంపకం వంటి విలువలను ఆచరణలో నేర్పిస్తూ పాఠశాలను పచ్చని, ఆహ్లాదకరమైన విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం చేస్తున్న కృషికి ఈ పురస్కారం నిదర్శనంగా ఉంది.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలనే సందేశాన్ని ఈ విజయం ఆదర్శంగా ఉందని తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సిఐ శ్రీహరి

మొబైల్ ఫ్లాష్ లైట్ లతో ర్యాలీ విజయవంతం

సత్తుపల్లి అక్టోబర్31(ప్రజా జ్యోతి) ఖమ్మం సిపి సునీల్ దత్ అడిషనల్ డీసీపీ , ఎసిపి కల్లూరు ఉత్తర్వుల మేరకు శనివారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జేవిఆర్ కాలేజీ గ్రౌండ్ నందు సాయంత్రం 6 గంటలకు సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ అనే సైబర్ అవేర్నెస్ ప్రోగ్రాం , తర్వాత జీఎ= కాలేజ్ గ్రౌండ్ నుంచి రింగ్ సెంటర్ వరకు అవేర్నెస్ ప్రోగ్రాం పై ర్యాలీ నిర్వహించినారు. కాలేజ్ వరకు మొబైల్ ఫ్లాష్ ఆన్ చేసుకొని ర్యాలీ విజయవంతం చేశారు. ఇట్టి కార్యక్రమంలో సుమారు 2000 మంది వరకు వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఖమ్మం కమిషనరేట్ సైబర్ సెల్ ఏసిపి ఫణింధర్ , సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి మరియు సత్తుపల్లి పోలీస్ సిబ్బంది ఢ సైబర్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ మరియు సిబ్బంది పాల్గొని ఓటిపి ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ ఆప్స్.... మొదలగు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దని, మేము పోలీసులు అంటూ బ్యాంకు వాళ్ళం ఫోన్ కాల్స్ మోసపోయి మీ డబ్బులను పాడు చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు అందరు టీంగా పని చేయాలి

పోలింగ్ రోజు చాలా ముఖ్యమైనది.:

జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల

పిఓలు,ఏపిఓలు,ఓపిఓలలు అందరు చిత్తశుద్ధితో బాధ్యతగా ఎన్నికలు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పేర్కొన్నారు. శనివారం ముప్పాళ్ల లో 2 వ సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థలు ఎంపీటీసీ ,జడ్పీటీసీ ఎన్నికల పి ఓ,ఏ పి ఓలు,ఓ పి ఓ ల కు 2 వ విడత శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి ఓ లు,ఏ పి ఓలు,ఓ పి ఓ లు అందరు చిత్తశుద్ధితో ఎన్నికలు విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. బారత రాజ్యాంగ లో ఎన్నికలు స్వచ్ఛగా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఉందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడం అదృష్టం గా బావించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు మనందరం బాధ్యతగా పని చేయాలన్నారు. ముఖ్యంగా సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది నియామకం, అక్కడ నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టమైన అవగాహన కల్పించారు.పోలింగ్ రోజు చాలా ముఖ్యమైందని పి ఓ ఏపీ ఓపిఓలు అందరూ సమానంగా విధులు నిర్వహించాలన్నారు పోలింగ్ కేంద్రంలో ఏమైనా గొడవలు జరిగితే కూల్ గా ఉండాలన్నారు మీకు ఏమైనా సమస్యలు ఇబ్బందులు ఉంటే అధికారి ఎంపీడీవో తాసిల్దారు పోలీస్ సిబ్బంది అందరూ ఉంటారని మీకు ఏమైనా అవసరమైతే వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ ద్వారా తెలియజేయగలరు అని తెలిపారు.

హైకోర్టు జడ్జి సిద్దిపేట జిల్లాలో పర్యటన

సిద్దిపేట : రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శరత్ శనివారం జిల్లాలో పర్యటించి జిల్లా కేంద్రంలోనీ సంతోషిమాత ఆలయం దగ్గరలో జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించారు. జిల్లా కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బంది మరియు కోర్టుపనుల మీద వచ్చే ప్రజల సౌకర్యార్థం మెడికల్ డిస్పెన్సరీని ప్రారంభించి వసతులను పరిశీలించారు. అనంతరం కోర్టు భవనంలోని మూడో ఫ్లోర్ లో గల కాన్ఫరెన్స్ హాల్లో జ్యుడీషియల్ అధికారులతో జ్యుడీషియరీ రివ్యూ లో పాల్గొన్నారు. శనివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్ కు జిల్లా జడ్జి జి. సుదర్శన్, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రశ్మీ పెరుమాళ్ లు పూల బోకే అందించి స్వాగతం పలికారు. పోలీసు వారు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు జడ్జి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, అదన్నపు డిసిపి కుషాల్కర్, బార్ అసోసియేషన్ సభ్యులు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, న్యాయశాఖ, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌లో అలసత్వం వద్దు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న

నంద్యాల, అక్టోబర్ 31 నంద్యాల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న కోరారు. నవంబర్ 1న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని సూచించారు.ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు తదితర ఎన్నికల సంఘం అనుమతించిన గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం, ఓట్ల అభ్యర్థన నిషేధమని, ఓటర్లను వాహనాల్లో తరలించరాదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలను ఓటింగ్ గదిలోకి తీసుకెళ్లడం, ఓటింగ్ ప్రక్రియను చిత్రీకరించడం నిషిద్ధమన్నారు.పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, గందరగోళం సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంయమనం పాటిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు సహకరించాలని కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి బాయి, ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, సీఎంఎం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.